క్లుప్తంగా

సగరుల అభివృద్ధికి కృషి చేయాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సగరులు(ఉప్పర) అభివృద్ధి కోసం కృషి చేయాలని జిల్లా సగర సంఘం అధ్యక్షుడు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్ అన్నారు. బుధవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం తరపున సగరుల సంక్షేమం, అభివృద్ధి కోసం కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సగరలో ఉన్న జిల్లాలోని పేద విద్యార్థులకు మెరిట్‌స్కాలర్‌షిప్‌లు వంటి చర్యలపై సంఘం పెద్దలతో సమాలోచనలు చేసి కార్యచరణ ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సగర సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణసాగర్, రవీందర్, బుడ్డన్నసాగర్, యువజన సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌సాగర్, సత్యన్నసాగర్, చిన్నకిష్టన్న, నవీన్‌సాగర్, శివాసాగర్ పాల్గొన్నారు.

బీజేపీ అధికారమే లక్ష్యం



మిడ్జిల్: వచ్చే ఎన్నికలలో బీజేపీ అధికారమే లక్ష్యంగా బూత్ స్థాయి కార్యకర్తలు పని చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిరుపతి సూచించారు. బుధవారం మండల పరిధిలోని అయ్యవారిపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్ అధ్యక్షతన 235 బూత్ స్థాయి కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా భీమయ్య, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, రాములు, ప్రధాన కార్యదర్శిగా కృష్ణయ్య, కార్యదర్శులుగా శ్రీశైలం, చెన్నయ్య, సోషల్ మీడియా కన్వీనర్‌గా గొర్ల సురేష్, కార్యవర్గ సభ్యులుగా అరుణమ్మ, జంగయ్య, శేఖర్, శ్రీను, హుస్సేన్, కృష్ణయ్య, గణేష్‌లను ఎంపిక చేశారు. అనంతరం కమిటీకి నియామక పత్రం అందజేశారు.

సహకార సంఘం అభివృద్ధికి పర్యటన



నవాబుపేట: సహకార సంఘం అభివృద్ధి కోసం క్షేత్రస్థాయి పర్యటన చేసినట్లు మండల సహకార సంఘం చైర్మన్ నర్సింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సహకార సంఘాల చైర్మన్‌లతో కలిసి కరీంనగర్ జిల్లా చొప్పదండి సహకార సంఘం అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించినట్లు ఆయన వివరించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, తదితర వాటితో పాటు ఆర్థిక బ్యాంకు కొనసాగుతున్న విధానాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. రైతులకు చేయూత ఇస్తునే ఆర్థికంగా బ్యాంకులు ఎదిగేల చేస్తున్న ఆర్థిక వనరుల కల్పన, నిత్య బ్యాంకు లావాదేవీలు తదితర వాటిపై పూర్తి స్థాయిలో పరిశీలన చేసినట్లు ఆయన తెలిపారు.

క్రీడల్లో రాణించాలి



చిన్నచింతకుంట: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పర్దిపూరంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని గ్రామంలోని యువకులకు గ్రామ స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. బుధవారం ఆటపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆటలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట సుప్రియ, టీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటరాము, రైతు సమన్వయ కమిటీ జిల్లా మెంబర్ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

దేవరకద్ర: మండలంలోని పెద్దరాజమూర్‌లో జర్నలిస్టు శ్రీనివాస్ తండ్రి పొద్దుటూరి వెంకటేశ్ శెట్టి మృతి చెందడంతో బుధవారం పలువురు గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ నాయకులు కొండ ప్రశాంత్‌రెడ్డి, కిషన్‌రావు, మాజీ ఎంపీపీ గోపాల్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు కల్వ కన్నయ్య, నాగయ్యగుప్తా, నాగులు, హరికాంత్‌లతో పాటు మండల జర్నలిస్టు నాయకులు గ్రామానికి వెళ్లి వెంకటేశ్ శెట్టి పార్థీవ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'కంటి వెలుగు'కు సర్వం సిద్ధం

దేవరకద్ర: మండల కేంద్రంలోని అన్ని వార్డులలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు ఇంటింటికి తిరిగి కంటి వెలుగుకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సందర్భంగా కంటి వెలుగుపై ప్రజలకు అవగాహన కలిగిస్తు కరపత్రాలను పంపిణీ చేశారు. గురువారం నుంచి అధికారికంగా కంటి వెలుగు పరీక్షలు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశారు. దేవరకద్రలోని మండల మహిళా సమాఖ్య భవనంలో కంటి వెలుగుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను చేశారు. మండల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షణ చేశారు.

నవాబుపేట: మండలంలో కంటి వెలుగు కార్యక్రమం 3 గ్రామాల్లో ప్రారంభిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని కొల్లూర్, కాకర్‌జాల్‌తండాలలో మూడు బృందాలు కంటి వెలుగు కార్యక్రమం గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారని ఆమె వివరించారు. కావున ఆయా గ్రామాల ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరికి పరీక్షలు చేయనున్నారు.

హన్వాడ: మండల పరిధిలోని సల్లోనిపల్లి, హన్వాడ, టంకర గ్రామాల్లో గురువారం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ సభ్యుడు విజయనిర్మల, ఎంపీడీఓ ధనుంజయగౌడ్‌లు బుధవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. హన్వాడ, సల్లోనిపల్లి గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి అన్ని గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, అందరూ అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.



పారుపల్లిలో కంటి వెలుగు ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

కోయిల్‌కొండ: కంటి వెలుగు కార్యక్రమాన్ని అర్హులైన వారు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రేమ్‌రాజ్, ఎంపీడీఓ జయరాములు అన్నారు. బుధవారం మండలంలోని పారుపల్లిలో కంటి వెలుగు ఏర్పాట్లను వారు పరిశీలించారు. మండలంలో గురువారం 19నుంచి మే 22వ తేదీ వరకు మండలంలో నాలుగు బృందాలు కంటి వెలుగులో పాల్గొననున్నారు. ఒక్కో బృందంలో 300మందికి కంటి వెలుగు పరీక్షలను ప్రతిరోజు నిర్వహించనున్నారు. ఒక్కో బృందంలో 8మంది వైద్యసిబ్బంది పాల్గొననున్నారు.

గండేడ్/మహమ్మదాబాద్: ఉమ్మడి గండేడ్ మండల పరిధిలోని చిన్నయపల్లి, మహమ్మదాబాద్, జానంపల్లి, అంచన్‌పల్లి గ్రామాల్లో గురువారం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి బుధరవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గండేడ్ మండలంలోని జానంపల్లిలో కంటివెలుగు కార్యక్రమంపై వైద్యులు ట్రయల్‌రన్ నిర్వహించారు.



దేవరకద్రలో కంటి వెలుగు కరపత్రాలను పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు

హిందువులపై దాడులను అరికట్టాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో ఎక్కడా చూసినా హిందువులపై దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కరీంనగర్‌లో జిల్లాలో ఒక బజరంగ్‌దళ్ కార్యకర్తపై విచక్షణ రహితంగా కత్తులతో పొడిచి చంపడం దారుణమని వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. లవ్‌జిహాదీ పేరుతో హిందు అమ్మాయిలను చంపుతున్నారని, కేరళలో అనేకమంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను చంపుతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇలాంటి సంఘటనలను అరికట్టాలని విశ్వ హిందు పరిషత్ రాష్ట్ర కమిటీ సూచనమేరకు జిల్లా అదనపు కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, కార్యదక్షులు బుచ్చారెడ్డి, పట్లోళ్ల లక్ష్మారెడ్డి, నగర అధ్యక్షుడు చాపల హన్మంతు, నగర బజరంగ్‌దళ్ ప్రముఖ్ సంపత్, సందీప్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.



జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

పండగకి వెళ్లిన తల్లీపిల్లల అదృశ్యం



దేవరకద్ర: సంక్రాంతి పండగకి వెళ్తానని తన ఇద్దరు పిల్లలతో వెళ్లిన మహిళ అదృశ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జోకూర్‌కి చెందిన గోపని సుధ (25) కొడుకు, కూతురుతో కలిసి సంక్రాంతి పండుగ కోసం ఆమె తల్లి ఊరు సిద్దిపేట జిల్లా నంగునూరుకి ఈనెల 12న బయలు దేరారు. కానీ బుధవారం వరకు కూడ నంగునూరుకు వెళ్లలేదు. దీంతో తన భార్య, పిల్లలు ఎక్కడికి వెళ్లారో తెలియడం లేదని భర్త గోపని సూరి ఫిర్యాదు చేశాడని ఎస్‌ఐ భగవంతరెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కీలక పాత్ర



యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంలో యువజన విభాగం కీలక పాత్ర పోషించాలని కాంగ్రెస్ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జహీర్ అఖ్తర్ అన్నారు. పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకమైన మహ్మద్ సల్మాన్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జహీర్ అఖ్తర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో యువజన విభాగానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇప్పటి ఎంతోమంది సీనియర్ నాయకులు ఒకప్పుడు యువజన కాంగ్రెస్ నుంచి వచ్చినవారేనని అన్నారు. పట్టణంలో యువజన విభాగాన్ని మరింతగా పటిష్టం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఖాజా అజ్మత్‌అలీ, మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ అజీజ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అవేజ్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నాగరాజు, అలీం, పీర్ సాధిక్, అలీ, జహీర్, ఫక్రు, శివ పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీహాల్ స్థల పరిశీలన



జడ్చర్ల టౌన్: వెంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ స్థలాన్ని సోషల్‌వెల్ఫేర్ డీడీ పాండు బుధవారం పరిశీలించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.25లక్షలు మంజూరయ్యాయి. అయితే స్థలం సమస్య కారణంగా నిర్మాణానికి నోచుకోలేదు. స్థలాభావంతో గతంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ నిర్మాణం చేసేందుకు అనువుగానే ఉందని నిర్ణయించి త్వరలోనే పనులు ప్రారంభిద్దామని ఆయన ప్రకటించారు. ఆయన వెంట జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, వార్డు కౌన్సిలర్ ఆలూరి శశికిరణ్, ఏఎంసీ డైరెక్టర్ కొంగళి నాగరాజు, ముడా డైరెక్టర్ ప్రీతంలు ఉన్నారు.

పల్లె కట్టుబాటుకు పన్నెండేళ్లు

- విజయవంతంగా మద్యపాననిషేధం
- చెన్నరెడ్డిపల్లిలో యువత నిర్ణయం

నవాబుపేట: ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా పన్నెండేళ్ల మద్యపాన నిషేదానికి కట్టుబడి ముందుకు సాగుతుంది ఆ పల్లె. గతంలో చేసుకున్న కట్టుబాటును నేటికి కొనసాగిస్తూ ఆ గ్రామంలో ఎలాంటి మద్యం గొడవలు జరగకుండ ప్రశాంతంగా సాగుతోంది. గతంలో పండగలు తదితర శుభకార్యాలు వస్తే చాలు గొడవలు సాధారణం. కానీ మద్యపాన నిషేదంతో గొడవలకు చెక్ పెట్టారు చెన్నరెడ్డిపల్లి గ్రామస్తులు.



చెన్నరెడ్డిపల్లి గ్రామం

మద్యం తగాదాలకు చెక్..

మండల పరిధిలోని చెన్నరెడ్డిపల్లి అంటేనే గతంలో గొడవలకు పెట్టింది పేరుగా ఉండేది. నాటు సారా, మద్యంతో నిత్యం చాలా గొడవలు జరిగేవి. పలుమార్లు పోలీస్‌స్టేషన్‌లో కేసుల వరకు సైతం వచ్చాయి. అలాంటి గ్రామంలో గొడవలకు మద్యం తగాదాలకు చెక్ పెట్టాలని 2011లో యువకులు నిర్ణయం తీసుకుని మద్యపాన నిషేదం కోసం తీర్మానించుకుని గ్రామ పెద్దల సమక్షంలో నిర్ణయాన్ని వెల్లడించారు. దీంతో గ్రామం మొత్తం మద్యపాన నిషేదానికి కట్టుబడి ముందుకు సాగింది. గ్రామంలో ఉన్న బెల్టు దుకాణాలు, నాటుసారా కొట్లు అన్ని మూతపడ్డాయి. ఎవరు మద్యం అమ్మిన తాగిన గ్రామంలో శిక్ష లేక జరిమానా వేస్తామని వెల్లడించారు. దీంతో గ్రామంలో మద్యం గొడవలు ముగిశాయి. యువత సైతం చాలా మంది ఉపాధి తదితర వాటిపై దృష్టి సారించి ముందుకు సాగారు. కాగా మొదట్లో కాస్తా మద్యం విక్రయించే వారికి ఉపాధి కోల్పోయారని కొందరు విమర్శించిన వారంతా ప్రస్తుతం గ్రామ శ్రేయస్సుకోసం మద్యం విక్రయాలు మానేసి కిరాణం తదితర వాటిని ఏర్పాటు చేసుకున్నారు..

నిత్యం కుటుంబ కలహాలు జరిగేవి



ప్రతి నిత్యం కుటుంబ కలహాలు జరిగేవి. మద్యం తాగి కుటుంబసభ్యులతో గొడవలు మామూలయ్యేవి. అలాగే గొర్రెల చోరీలు, కలహాలతో పంటలకు నిప్పుపట్టడం వంటి సంఘటనలు చాలా చోటుచేసుకున్నాయి. పండగ వచ్చిందంటే పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కాల్సిందే. తాజాగా మద్యం నిలిపివేయడంతో ప్రశాంతంగా మారింది.

– వెంకటేష్, చెన్నరెడ్డిపల్లి

ప్రశాంతంగా మారింది



గ్రామం సారాతోనే పొద్దులేచేది. ఇక్కడ గల్లీలో సారా కంపురోడ్ల వరకు వచ్చేది. అలాంటిది అందరం కలిసి తీసుకున్న నిర్ణయంతో గ్రామం ప్రశాంతంగా మారింది. రోజు పనులు చేసుకుంటూ సాఫీగా జీవిస్తున్నారు. అక్షరాస్యత సైతం లేని గ్రామంలో మాటకు కట్టుబడి నేటికి మద్యపాన నిషేదం కొనసాగుతోంది.

– రవి, చెన్నరెడ్డిపల్లి

యువత పట్టుదలతోనే



గ్రామంలో యువత మద్యం అమ్మకాలు నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నారు. దానికి అందరు కలిసి తోడ్పాటు అందించాం. దీంతో మొదట మద్యం విక్రయించే వారితో మాట్లాడి సమస్య వివరించి పూర్తిగా మద్యం అమ్మకం మానుకోవాలని చెప్పాం. ఇతర వ్యాపారంపై దృష్టి పెట్టాలని మద్యం విక్రయాలు పూర్తిగా నిలిచేలా చేశాం.

– యాదయ్య, సర్పంచ్, చెన్నరెడ్డిపల్లి

నిజాం సేవలు మరువలేనివి



మదర్సాలో ఖురాన్ పఠనం చేస్తున్న బాలికలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజలకు నిజాం నవాబులు అందించిన సేవలు మరువలేనివని పలువురు మదర్సా వైస్ ప్రిన్సిపాల్ ఆలీమా రయిస్ సుల్తానా అన్నారు. జిల్లా కేంద్రం షాసాబ్‌గుట్టలో గల మదర్సా దారుల్‌ఉలుమ్ అరెబియా లిన్‌బనాత్ (బాలికల)లోని రాబియా బస్రీ హాల్‌లో బుధవారం 8వ నిజాం ముకర్రంజా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 8వ నిజాం ముకర్రంజా స్వర్గప్రాప్తి కోసం ప్రత్యేక ప్రార్థనలు, ఖురాన్ పఠనం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నిజాం చక్రవర్తులు తమ హయాంలో అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడ్డారని అన్నారు. వేలాది కోట్ల ఆస్తులు ఉన్నప్పటికీ 8వ నిజాం ముకర్రంజా అతి సాధారణ జీవితాన్ని గడిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో మదర్సా వైస్ ప్రిన్సిపాల్ ఆలీమా రయిస్ సుల్తానా, అకాడమిక్ డైరెక్టర్ సాజిదా బేగం, టీచర్లు సల్మా సుల్తానా, హంసా బేగం, రేష్మాబేగం, హాఫిజా రహీమున్నిసా, హాఫిజా యాస్మిన్‌బేగం, మహేర్‌జహా, ఉమ్మేహాని, షబానాబేగం, తహమీనా బేగం, నస్రీన్‌ఉన్నిసాబేగం పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి

జడ్చర్ల టౌన్: స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక మండల కేంద్రంలో టీడీపీ నాయకులు నివాళులర్పించారు. ఆ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మెట్టుకాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిగ్నల్ గడ్డపై టీడీపీ జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తుల నర్సింహులు, శివరాములు, అంజయ్య యాదవ్, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలో ఎర్రసత్యం చౌరస్తాలో ఎన్‌టీఆర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పక్కి, సత్యనారాయణగౌడ్, స్వామి, వెంకటయ్య, పాండు, శ్రీను పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పార్లమెంట్ అధ్యక్షుడు మెట్టుకాడీ శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, వెంకటయ్య, వెంకటరాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వాల్టా చట్టానికి తూట్లు

- అక్రమంగా కలప రవాణా
- పట్టించుకోని అధికారులు

బాలానగర్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూ.కోట్ల ప్రజాధనంతో చేపట్టిన హరితహార కార్యక్రమం ఓ వైపు యుద్ధంలా సాగుతుంటే.. అక్రమ కలప వ్యాపారులు మాత్రం పరిశ్రమలతో కుమ్మక్కై ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వృక్షాలను, చెట్లను నరికి కలప పరిశ్రమలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు ప్రతి నిత్యం జరుగుతూనే ఉన్నా అటవీ శాఖ అధికారులు పరిశ్రమ వ్యక్తులతో, కలప అక్రమార్కులు కుమ్మక్కై ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రం నుంచి జాతీయరహదారిపై నుంచి ట్రాక్టర్లలో కలప అక్రమ రవాణా సాగుతున్నా.. సీసీ కెమెరాల ముందే పోతున్నా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు వాల్టా చట్టానికి పని చెప్పడంతోపాటు అక్రమ కలప వ్యాపారులపై కఠినంగా వ్యవహరించాలని హరిత ప్రేమికులు, సామాజిక వ్యక్తులు డిమాండ్ చేస్తున్నారు.



అప్పాజిపల్లి వద్ద ట్రాక్టర్‌లో ఓ పరిశ్రమకు తరలుతున్న కలప అక్రమ రవాణా

ఘనంగా లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చనలో మహిళలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి దేవాలయంలో బుధవారం లక్ష పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలోని వేదికపై కొలువు తీరిన చెన్నకేశవస్వామి, శ్రీదేవి భూదేవి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం లక్ష పుష్పార్చన ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య పలువురు మహిళలు ఉత్సవ మూర్తులపై పుష్పాలను వేశారు. ఈ కార్యక్రమం దాదాపు రెండు గంటల పాటు కొనసాగింది.



పుష్పాల మధ్య చెన్నకేశవస్వామి, శ్రీదేవి భూదేవి ఉత్సవమూర్తులు

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి



బద్రునాయక్(ఫైల్)

గండేడ్: మండల పరిధిలోని మన్సూర్‌పల్లితండాకు చెందిన ఆర్మీజవాన్ బద్రునాయక్ బుధవారం గుండెపోటుతో ఆకస్మిక మృతిచెందాడు. 2002లో ఆర్మీలో ఉద్యోగం సాధించిన బద్రు వృత్తిరిత్యా విశాఖపట్నంలో ఐటీబీపీలో విధులు నిర్వర్తిస్తున్నాడు. తండాలో పండగ కోసం వచ్చిన బద్రు ఇలా ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

నవాబుపేట: మండల పరిధిలోని అమ్మపూర్ గేట్ సమీపంలో బ్రిడ్జి దగ్గర బుధవారం అతి వేగంతో వచ్చిన కారు బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న కొందుర్గు మండలం వెనికిర్యాల్‌కి చెందిన నాని, శేఖర్‌లు గాయపడ్డారు. నవాబుపేట నుంచి వెనికిర్యాల్‌కి వెళ్తున్న తరుణంలో కారు అతివేగంతో బోల్తాపడిందన్నారు. ఈ సంఘటనలో గాయపడిన వారిని స్థానికులు వెంటనే 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.